క్లుప్తంగా

నూతన జడ్జీలకు సన్మానం



సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (లీగల్) : ఇటీవల జరిగిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన జస్వంతి యాదవ్, నమ్రతను బుధవారం సాయంత్రం బార్ అసోసియేషన్ కార్యాలయంలో సత్కరించారు. ఆ అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. చిన్న వయస్సులో జస్వంతి యాదవ్, నమ్రత జడ్జీలుగా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. న్యాయమూ ర్తులుగా వారు మంచి తీర్పులు చెప్పి సమాజంలో కీర్తి ప్రతిష్టలు పొందాలని ఆకాంక్షించారు. అలాగే మరో యువతి జఫ్రిన్ జాతీయస్థాయిలో టెన్నిస్ పోటీల్లో పాల్గొని కర్నూలు కీర్తి దేశం నలుమూలల వ్యాపింపజేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, సబ్ జడ్జి మల్లీశ్వరి, దివాకర్, జూనియర్ సివిల్ జడ్జీలు జ్యోత్స్న దేవి, కళ్యాణి, వందన, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, బార్ అసోసియేషన్ సెక్రటరీ చక్రపాణి, న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎన్నికలకు వివరాలు పంపించండి



మాట్లాడుతున్న శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): శాసనసభ సాధారణ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కోరిన విధంగా వివరాలను పంపించాల్సి ఉందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్. శ్రీనివాస కుమార్ కోరారు. బుధవారం స్థానిక సంక్షేమభవన్‌లోని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాంబర్‌లో ఆయన జిల్లాలోని గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఎస్సీ కార్పొరేషన్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఈసీ ప్రొఫార్మా మేరకు 33 కాలమ్స్‌లో వివరాలను పూర్తి చేసి ఎలక్షన్ ఎంప్లాయిస్ డాటా యాప్‌లో వెంటనే అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల విధులకు కేటాయించిన ఉద్యోగులు చాలా అప్రమత్తంగా ఉండాలని, వారికి నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్ లక్ష్మిగుర్రప్ప, రామయ్య, శివక్రిష్ణ, సుప్రజ, మునిశేలయ్య, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ పర్యవేక్షకులు సీమోన్, ఎస్సీ కార్పొరేషన్ ఈఓ విజయలక్ష్మి, అలీబాషా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ వేలాలకు విశేష స్పందన

కర్నూలు (టౌన్): నగరపాలక రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో బుధవారం కౌన్సిల్ హాలులో నిర్వహించిన బహిరంగ వేలాలకు విశేష స్పందన లభించింది. స్థానిక కింగ్ మార్కెట్ వద్ద ఉన్న కూరగాయాల మార్కెట్‌ను రూ. 6.35 లక్షలు, చేపల మార్కెట్‌ను రూ.1.35 లక్షలు, నగరపాలక సంస్థ కార్యాలయంలో సైకిల్ స్టాండ్‌ను రూ.1.12 లక్షల చొప్పున పాట పాడి పాటదారులు దక్కించుకున్నారు. కిడ్స్ వరల్డ్ పార్కు వద్ద ఉన్న సైకిల్ స్టాండ్, పాతబస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాస క్లాత్ మార్కెట్ వద్ద ఉన్న సైకిల్ స్టాండ్ వేలాన్ని వాయిదా వేశారు. వేలాలను నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పర్యవేక్షించారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ వేలాల ద్వారా రెవెన్యూ విభాగానికి రూ.8.82 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

నేడు ఉద్యోగ మేళా

కర్నూలు సిటీ: నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గురువారం సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. వివిధ కంపెనీలు హాజరవుతున్న ఈ మేళాకు పదవ తరగతి ఆపై విద్యార్హత గల వారు అర్హులు. పూర్తి వివరాలకు సెల్: 8374231357, 8309283980, 6300009183 నంబర్లను సంప్రదించాని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు తెలిపారు.

పోలీసు డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్పీ తదితరులు

కర్నూలు : సమగ్ర సమాచారం కలిగిన డైరీ రోజువారి దైనందిన కార్యకలాపాల్లో పోలీసు సిబ్బందికి ఎంతో ఉపయోగపడుతుందని ఎస్పీ కృష్ణకాంత్ అభిప్రాయపడ్డారు. పోలీసు డైరీ–2024ను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలీసు డైరీలో ఉన్న సమాచారం మేరకు సిబ్బంది తమ నియమావళిని తెలుసుకుని సక్రమంగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తేవాలన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐలు నాగరాజు యాదవ్, శ్రీనివాస రెడ్డి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, పోలీసు హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు రఘురాముడు తదితరులు పాల్గొన్నారు.



పార్కులోని సైకిల్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు,



చిల్డ్రన్స్ ప్లే ఏరియా



పచ్చని మొక్కలు, చెట్ల మధ్య వాకింగ్ ట్రాక్

ఆహ్లాదం పిలుస్తోంది!

- నగర శివారులో సిద్ధమైన విజయవనం పుల్లయ్య పార్కు
- అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- 34 హెక్టార్లలో రూ.1.37 కోట్లతో సుందరీకరణ పనులు
- నగర వాసులు సేద తీరేలా వసతుల కల్పన
- నేటి నుంచి పార్కులోకి అనుమతి

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ పలు ప్రాంతాల్లో నగర వనాలను అభివృద్ధి చేస్తోంది. పట్టణ, నగర ప్రజలకు ఆహ్లాదం పంచడమే లక్ష్యంగా వాటిని తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే కర్నూలు నగర ప్రజలకు సిటీ ఫారెస్ట్‌ను అందుబాటులోకి తెచ్చిన ఆ శాఖ తాజాగా కర్నూలు–డోన్ జాతీయ రహదారిలో విజయవనం పుల్లయ పార్కును సిద్ధం చేసింది. దీనిని నగరంలోని పార్కు మాదిరిగా కాకుండా పట్టణ ప్రాంత అడవిగా తీర్చిదిద్దుతున్నారు. నగర వన్ యోజన పథకం కింద 34 హెక్టార్లలో రూ.1.37 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ పార్కులో సైక్లింగ్, వాకింగ్ పాత్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, గ్రీనరీ, ల్యాండ్ స్కేపింగ్, చైన్ లింక్ ఫెన్సింగ్, ప్రత్యేక పార్కింగ్ తదితరవి ఏర్పాటు చేస్తున్నారు. ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ సెంటర్ (ఈఈసీ)ను కూడా అభివృద్ధి చేస్తున్నారు. ఈనెల 26న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ పి.రామకృష్ణ, జిల్లా అటవీ శాఖ అధికారి పి.శివశంకర్‌రెడ్డి ప్రారంభించిన ఈ పార్కు నేటి నుంచి ప్రజలకు అందుబాటులోకి రానుంది.

టికెట్ల ధరల వివరాలు

- పార్కులోకి ప్రవేశం రుసుం పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.10.
- వాహనాల పార్కింగ్‌కు సంబంధించి టూవీలర్స్ రూ.20, త్రీ, ఫోర్ వీలర్స్‌కు రూ.40
- పార్కులోని వనదర్శిని వెహికిల్‌లో తిరిగేందుకు ఒక్కొక్కరికి టికెట్ రూ.50
- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు నెలకు ఒకరికి రూ.200

పార్కు సందర్శన వేళలు

- వాకర్స్‌కు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు
- ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సందర్శకులను అనుమతిస్తారు. 6 గంటలకు పార్క్‌ను మూసివేస్తారు.



కొండారెడ్డి బురుజు ఆకారంలో విజయవనం పుల్లయ్య పార్క్ ముఖ ద్వారం

ఆకట్టుకునేలా సుందరీకరణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రజలు సేద తీరేలా నగర వనాలను అభివృద్ధి చేస్తున్నాం. ఇప్పటికే కర్నూలు నగర వనానికి మంచి ఆదరణ లభిస్తోంది. కర్నూలు విజయవనం పుల్లయ్య పార్కు పనులు 90 శాతం పూర్తి అయ్యాయి. రూ. 97 లక్షలతో ఈ పనులు చేపట్టాం. మరో రూ.40 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో మరింత అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడతాం. గురువారం నుంచి నగర వాసులు విజయవనం పుల్లయ్య పార్కును సందర్శించవచ్చు.

– పల్లె శివశంకర్ రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి

అంటు వ్యాధుల నివారణలో వైద్యసిబ్బంది కీలకం



మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్): అంటు వ్యాధుల నివారణ, నియంత్రణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో టీబీ ముక్తభారత్ ఐపీసీ శిక్షణపై నిశ్చిత్ ప్లస్ షేర్ ఇండియా వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో అంటువ్యాధులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ తదితర విషయాలపై సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బందికి టీబీ, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ బేసిక్స్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. వైద్య సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రిమిసంహారక, స్టెరిలైజేషన్, పర్యావరణ సంక్రమణ నియంత్రణ, చేతి పరిశుభ్రత, ఐసోలేషన్, మల్టీ డ్రగ్ రెసిస్టెంట్‌పై షేర్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సతీష్ కపిల్యవార్ సమీక్ష నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ సీతారామయ్య, డాక్టర్ రామ్ బాలాజీనాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రిలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, బయోమెడికల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం

- సిద్ధం పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే కాటసాని



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు: ప్రజాసంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న అనంతపురం జిల్లాలో జరిగే సిద్ధం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్ధం సభకు రాయలసీమ జిల్లాలకు చెందిన అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, నాయకులు, కార్యకర్తలు హాజరవుతారన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ అందిస్తున్న సంక్షేమ పాలనకు గల తేడాను పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి తెలియజేయాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ హనుమంతురెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

దోమలు ప్రబలకుండా చూసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): దోమలు ప్రబలకుండా వైద్య సిబ్బందితో ప్రజలు సహకరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. బుధవారం ఆయన స్థానిక స్టాంటన్‌పురం, ఇల్లూరు నగర్, వడ్డేగేరి యూపీహెచ్‌సీలను సందర్శించారు. అక్కడ జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. రోగులందరికీ పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు. ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌కు హాజరైన గర్భిణులు, శిశువులకు టీకాలు ఎలా ఇస్తున్నారని పరిశీలించారు.

- నగరంలోని గడ్డవీధి, ఎర్రబురుజు పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలమ్మ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి తనిఖీ చేశారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. గర్భిణులకు పోషకాహారం గురించి వివరించారు. ప్రతి నెలా వారు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనత రాకుండా జాగ్రత్త పడాలన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న రిలయన్స్ ఫౌండేషన్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేంద్ర

కర్నూలు(అగ్రికల్చర్): రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో అన్నదాతలకు ఎంతో ప్రయోజనమని రిలయన్స్ ఫౌండేషన్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ సురేంద్ర తెలిపారు. బుధవారం కర్నూలు రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో అపార్డు సంస్థ తమ ట్రెనింగ్ హాల్‌లో రైతు ఉత్పత్తిదారుల నెట్‌వర్క్ సమావేశం నిర్వహించింది. ఆయన మాట్లాడుతూ... సంఘాల ఏర్పాటు ద్వారా రైతులు పండించిన ఉద్యాన ఉత్పత్తులను సామూహికంగా గిట్టుబాటు ధరలకు విక్రయించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్థానికంగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోతే సంఘం ద్వారా డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించుకోవచ్చని సూచించారు. నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ... రైతుల అభ్యున్నతికి నాబార్డు అనేక విధాల తోడ్పాటు ఇస్తుందని, ఇందులో భాగంగానే రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు జరిగిందన్నారు. అపార్డు సీఈఓ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... రైతులకు మెరుగైన సేవలు అందించడం రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో రిలయన్ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ కుమారస్వామి రెడ్డి, అపార్డు సంస్థ సీఈఓ జీవీ రెడ్డి, వివిధ రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈఓలు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో వివిధ చోట్ల అక్రమంగా గ్రావెల్ తరలించినట్లు తమ విచారణతో తేలిందని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గ్రావెల్ తవ్వకాలను మైనింగ్ అధికారులు పరిశీలించారన్నారు.గూడూరు మండలానికి చెందిన ఎ నజీర్.. సర్వే నంబర్ 663/2లో అక్రమంగా 1,121 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తరలించారని విచారణలో బయట పడిందన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన ఎస్ఎన్ చాంద్‌బాషా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 119/2లో 350 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తవ్వి తరలించారని తనిఖీలో తేలిందన్నారు. మొత్తం 3,138 క్యూబిక్ మీటర్లు అక్రమంగా గ్రావెల్‌ను తవ్వి తరలించిన అక్రమార్కులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. కృష్ణగిరి మండలం చుంచుఎర్రగుడి గ్రామంలో సర్వే నంబర్ 560లో లీజుదారుడు గని తరపు కేటాయించిన ప్రదేశం నుంచి 0.12 హెక్టార్లు బయటకు జరిగి ఖనిజ సంపదను తవ్వకాలు జరిపినట్లు విచారణలో తేలిందన్నారు. దీనికి సంబంధించిన యజమాని ఎస్ సూర్యచంద్రుడు నుంచి రూ.60వేలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు పాల్గొన్నారు.

రెండు లారీలు సీజ్

డోన్ నుంచి హైదరాబాద్, బెంగళూరుకు అక్రమంగా డొలమైట్ తరలిస్తున్న రెండు లారీలను డోన్ సమీపంలో సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డీడీ రాజశేఖర్ తెలిపారు. అలాగే ఉలిందకొండ దగ్గర అక్రమంగా మెటల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేశామన్నారు. మొత్తం రూ.1.20లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

అవీ-ఇవీ

శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన

కర్నూలు (లీగల్) : శాశ్వత లోక్ అదాలత్‌పై బుధవారం న్యాయ సేవా సదన్‌లో వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస రావు మాట్లాడుతూ సత్వర న్యాయం అందించేందుకు శాశ్వత లోక్ అదాలత్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న శాశ్వత లోక్ అదాలత్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకట హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ ఆత్మహత్యకు రెడ్డి ఏజెన్సీయే కారణం

కర్నూలు(సెంట్రల్) : క్లాప్ డ్రైవర్ ఆంజనేయులు ఆత్మహత్యకు రెడ్డి ఏజెన్సీయే కారణమని సీఐటీయూ నగర నాయకులు దూదేకొండ కుమార్ ఆరోపించారు. బుధవారం వెంకటరమణ కాలనీలోని క్లాప్ ఆటోలు ఆగే స్థలంలో ఆంజనేయులు ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో ఆయనకు నివాళి అర్పించారు. సరిగ్గా జీతాలు ఇవ్వకపోవడంతోనే అతను ఆత్మహత్య చేసుకున్నారని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఘు, శేఖర్,షఫీ, అశోక్, పరమేష్, దుర్గ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎంకు సన్మానం

కర్నూలు (సిటీ): ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ జిల్లా అధికారి వెంకటరామం బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో ఆయనను జిల్లాలోని ఆ సంస్థ అధికారులు,ఉద్యోగులు ఘనంగా సన్మానించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ బెంగాల్‌లో రాహుల్ గాంధీ భారత్ న్యాయ జోడో యాత్ర కారుపై రాళ్ల దాడి చేయడం హేయమని చర్యగా డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు అభివర్ణించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాహుల్‌గాంధీ యాత్రకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ బందోబస్తు కల్పించాలన్నారు.

పలువురు డీఎస్పీలు బదిలీ

సాక్షి, నంద్యాల: ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలువురు డీఎస్పీలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల డీఎస్పీగా ఉన్న సి. మహేశ్వరరెడ్డిని పలమనేరుకు, ఆళ్లగడ్డ డీఎస్పీ బి. వెంకటరామయ్యను నర్సీపట్నం, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్. రామాంజినాయక్‌ను ఏలూరుకు, ఏఆర్ డీఎస్పీ రంగమునిని ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు. అలాగే చిత్తూరు దిశా పోలీసు స్టేషన్ డీఎస్పీ జె. బాబు ప్రసాద్ కర్నూలు దిశా పోలీసు స్టేషన్‌కు, పలమనేరు డీఎస్పీ ఎన్. సుధాకర్‌రెడ్డి ఆళ్లగడ్డకు బదిలీపై వస్తున్నారు.

స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు ప్రోత్సాహమిస్తాయి

- నగర మేయర్ బీవై రామయ్య
- మలబార్‌గోల్డ్ ఆధ్వర్యంలో 215 మంది విద్యార్థులకు రూ.18.46 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల చెక్ అందజేస్తున్న మేయర్ రామయ్య, మలబార్ గోల్డ్ సంస్థ ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): పేద విద్యార్థులు చదువులో రాణించేందుకు స్కాలర్‌షిప్‌లు దోహదపడతాయని కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ(సీఎస్ఆర్) కింద మలబార్ గోల్డ్ సంస్థ వివిధ కళాశాలలకు చెందిన 215 మంది విద్యార్థులకు రూ.18.46 లక్షలు పంపిణీ చేసింది స్థానిక కేవీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమంలో మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద బంగారు, వజ్రాభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండటం అభినందనీయమన్నారు. ఈ సంస్థ దాతృత్వ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందన్నారు. మలబార్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా గత 20 ఏళ్లలో పేదల వైద్య సహాయానికి రూ.38.32 కోట్లకు పైగా ఖర్చు చేయడం సంతోషకర విషయమన్నారు. మలబార్ గోల్డ్ స్టోర్ హెడ్ ఫయాజ్ మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 5500 మంది పేద విద్యార్థులకు రూ.8000 నుంచి రూ.10 వేల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంటు స్టోర్ హెడ్ సమీర్, మార్కెటింగ్ మేనేజర్ నూరుల్లా, కేవీఆర్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ లాలెప్ప, వొకేషనల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ ఎస్టేట్ సౌకర్యాలపై ఆరా

- ఏపీఐఐసీ, ఐలా అధికారులతో చర్చించిన మున్సిపల్ కమిషనర్



ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు(అర్బన్): నగర పాలక సంస్థ పరిధిలోని కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఇతర సౌకర్యాలపై మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ ఆరా తీశారు. బుధవారం ఉదయం ఆయన తన సిబ్బందితో ఎస్టేట్‌లోని పలు ప్రాంతాలను సందర్శించారు. ఈ నేపథ్యంలోనే ... ఏపీఐఐసీ, ఐలా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. రామక్రిష్ణారెడ్డి, కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి, జోనల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి ఎస్టేట్‌లో చేపట్టాల్సిన పనుల వివరాలను కమిషనర్‌కు వివరించారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో దాదాపు 200 వరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయని, ఇక్కడ రోడ్లు, డ్రైనేజీ, ముఖ్యంగా నీటి సరఫరాను పునరుద్ధరించాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చినట్లు ఐలా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి తెలిపారు. అలాగే ఎస్టేట్ చుట్టు ప్రహరీ గోడ, వక్కెర వాగు నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయడంతో పాటు ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఎస్టేట్‌లోని మెయిన్ రోడ్, అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని విన్నవించామన్నారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ సాధ్యసాధ్యాలను పరిశీలించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారన్నారు.

సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు



డీఈఓ రంగారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కార్యాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు

కర్నూలు (సిటీ) : విధుల నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ డీఈఓ రంగారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన పదవీవిరమణను పురస్కరించుకుని డీఈఓ ఆఫీస్ స్టాఫ్ ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొని డీఈఓ సేవలను కొనియాడారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ తాను విజయవంతంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ ఆఫీస్ ఏడీలు శామ్యూల్ పాల్, శ్రీనివాసరావు, కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, సమగ్ర శిక్ష అదనపు కోఆర్డినేటర్ సీహెచ్ విజయ జ్యోతికుమారి, డీఈఓ ఉద్యోగుల సంఘం నాయకులు బలరామిరెడ్డి, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యం అసోసియేషన్ నాయకులు వాసుదేవయ్య, నాగరాజు, రవీంద్ర విద్యాసంస్థల వైస్ చైర్మన్ జి.వంశీ, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము చెల్లించాల్సిందే

- ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): సహేతుకమైన కారణాలు లేకుండా బీమా సొమ్మును ఇవ్వని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తీరును జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తప్పుబట్టింది. రెండు వేర్వేరు కేసుల్లో బాధితులకు రూ.50 లక్షల చొప్పున చెల్లించాలని, అలాగే పరిహారం, కోర్టు ఖర్చులకు మరో రూ.60 వేలు చెల్లించాలని కమిషన్ సభ్యులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ బుధవారం తీర్పునిచ్చింది. నందికొట్కూరు పట్టణం సుబ్బారావు పేటకు చెందిన ఆయిల్ వ్యాపారి పి.మధుకుమార్ (41) 2021 మార్చిలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.50 లక్షల జీవిత బీమా పాలసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే ఏడాది ఏప్రిల్ 3న కర్నూలు పట్టణంలోని సరస్వతి నర్సింగ్ హోంలో డాక్టర్ వేణుగోపాల్ అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, పాలసీ ఇచ్చేందుకు అర్హుడని నిర్ధారించారు. దీంతో అదే ఏడాది ఏప్రిల్ 12న ఎస్‌బీఐ లైఫ్ అధికారులు రూ.76 వేలు ప్రీమియంగా తీసుకుని పాలసీ జారీ చేశారు. 2022 ఏప్రిల్‌లో కూడా రూ.76 వేలు మధుకుమార్ ప్రీమియంగా చెల్లించారు. 2022 ఆగస్టు 19న గుండెనొప్పితో మధుకుమార్ మృతిచెందారు. దీంతో బీమా సొమ్ము చెల్లించాలని మధుకుమార్ భార్య పి.శైలజ దరఖాస్తు చేసుకున్నారు. అయితే 2016లో గుండె జబ్బుకు మధుకుమార్ వైద్యం చేయించుకున్నారని, అది దాచిపెట్టి పాలసీ తీసుకున్నారంటూ బీమా సొమ్మును ఇచ్చేందుకు ఎస్‌బీఐ లైఫ్ నిరాకరించింది. దీంతో బాధితురాలు కమిషన్‌ను ఆశ్రయించింది. అన్ని ఆధారాలను పరిశీలించిన కమిషన్ అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహ/ంచి సదరు వైద్యుడు ఆరోగ్యంగా ఉన్నాడని నిర్ధారించిన తర్వాతే పాలసీ జారీ చేశారని, దాదాపు ఆరేళ్ల కింద గుండె జబ్బులకు చికిత్స పొందారంటూ బీమా సొమ్ము తిరస్కరించడం సరికాదని కమిషన్ స్పష్టం చేసింది. బాధితురాలికి రూ.50 లక్షలు, పరిహారం, కోర్టు ఖర్చులకు రూ.60 వేలు చెల్లించాలని తీర్పునిచ్చింది.

మరో కేసులో...

కర్నూలు పట్టణం రోజా వీధికి చెందిన బి.కాశిరెడ్డి 2020 డిసెంబర్ 19న ఎస్‌బీఐ లైఫ్ స్మార్ట్ షీల్డ్ పాలసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన తర్వాత డిసెంబర్ 29న ఎస్‌బీఐ లైఫ్ పాలసీ జారీ చేసింది. 2022 జూన్ 27న తిరుమలలో వరహాస్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న సమయంలో గుండెనొప్పి రావడంతో మృతి చెందారు. 2017లో కిమ్స్ ఆసుపత్రిలో దంత సంబంధమైన వ్యాధికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారని, ఆ విషయాన్ని దాచి పాలసీ తీసుకున్నారంటూ ఎస్‌బీఐ లైఫ్ బీమా సొమ్ము ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో కాశిరెడ్డి భార్య సుబ్బలక్ష్మమ్మ వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. అన్ని ఆధారాలను పరిశీలించిన కమిషన్ 201లో కాశిరెడ్డి దవడకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారని, దాదాపు ఐదేళ్ల తర్వాత 2022లో గుండెనొప్పితో చనిపోయారని కమిషన్ స్పష్టం చేసింది. గతంలో ఆయన చేయించుకున్న చికిత్సతో గుండెనొప్పి వచ్చే అవకాశం లేదని, ఆయనకున్న దంత సంబంధిత వ్యాధి నయం కాదగినదేనని అభిప్రాయపడింది. బాధితురాలికి బీమా సొమ్ము రూ.50 లక్షలు చెల్లించాలని, పరిహారం, కోర్టు ఖర్చులకు మరో రూ.60 వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.